క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆదివారం పూర్వాభద్ర నక్షత్రం, మాస శివరాత్రిని పురస్కరించుకుని భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి సన్నిధిలో విశేష అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున రామలింగేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను చేపట్టారు. పంచముఖ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మలు విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. స్వామివార్లకు నిర్వహించిన విశేష అభిషేకాల్లో పలువురు ఉభయ దాతలు, భక్తులు పాల్గొని తమ గోత్రనామాలతో పూజలు జరిపించుకున్నారు. అనంతరం పంచహారతుల సేవ నిర్వహించారు.

ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రేపు రాజ్యాంగ శ్రవణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 9వ తేదీ మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ శ్రవణం నిర్వహిస్తున్నట్లు ఎంబీ విజ్ఞాన కేంద్రం బాధ్యుడు పి.మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీ విజ్ఞాన కేంద్రం, జీఆర్కే – పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, పాల్గొని సందేశం అందజేస్తారన్నారు. డ్యాన్స్ మాస్టర్ చందు ఆధ్వర్యంలో గాయత్రీ బృందం నృత్యాలు ప్రదర్శిస్తారని తెలిపారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: బెజవాడ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సీనియర్ గాయకుడు డేవిడ్ రాజు ఆధ్వర్యంలో కొమ్మినేని రత్నకుమారి, మల్లాది స్వాతి, వడ్డాది కామేశ్వరి, అయ్యప్పన్, సయ్యద్ ఆలీ, శ్రీనివాసరావు, సాయిబాబు, హనుమంతరావు, పీ బ్రహ్మం సినీ గీతాలు ఆలపించారు. సంగీత విద్వాంసుడు దావులూరి వీరభద్రరావు మాట్లాడుతూ గాయకులు స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. వివిధ రంగాలకు చెందిన ప్రసూనా రామన్, కొప్పరపు బలరామకృష్ణమూర్తి, ఉమాబలరాం పాల్గొన్నారు.

భూసంప్రోక్షణ కుంకుమ పూజ



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ రామాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని రైతులు భూ సంప్రోక్షణ కుంకుమ పూజా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని వ్యవసాయ భూముల్లోని మట్టిని సేకరించి స్వామివారి ఆలయంలో కుంకుమ పూజ చేశారు. నూతన క్రోధి సంవత్సరంలో వ్యవసాయం, పాడి పంటలు విరివిగా పండాలని పూజలు జరిపారు. స్వామి సన్నిధిలో పూజలు చేసిన మట్టిని ఉగాది పండుగ రోజున తమ వ్యవసాయ భూముల్లో రైతులు చల్లుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ రైతులు లక్ష్మయ్య, రాజారావు తెలిపారు. రాష్ట్ర సంయోజక్ తిరుపతయ్య, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షహీద్ బాబా దర్గా ఉరుసు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి ఖిల్లా వద్ద గల ప్రాచీన హజరత్ సయ్యద్ గాలిబ్ షహీద్ బాబా 436వ ఉరుసు మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సూఫీ మతగురువు మహ్మద్ అల్తాఫ్ రజా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బాబాకు ప్రత్యేక చాదర్ సమర్పించి మానవాళి శ్రేయస్సు కోసం ప్రత్యేక నమాజ్ చేశారు. గంథం మహోత్సవం కొండపల్లి వీధుల్లో వైభవంగా జరిగింది.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఎ.కొండూరు: బాలాజీ అనాథ, నిరాశ్రయ నిరుపేదల సేవా సంస్థ మధురానగర్ విజయవాడ వారిచే చీమలపాడు గ్రామంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులను ఆదివారం అందించారు. ప్రవాస భారతీయుడు బొప్పిన మహినాథ్ చౌదరి మాట్లాడుతూ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు వివరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు భాస్కరరావు, సెక్రటరీ వెంకట నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. ఆదరించండి

- ఎంపీ కేశినేని నాని, తిరుపతిరావు
- వైఎస్సార్ కాలనీలో పార్టీ కార్యాలయం ప్రారంభం



వైఎస్సార్ కాలనీలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ కేశినేని నాని, సర్నాల తిరుపతిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గడిచిన ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఈ కాలనీకి వచ్చి ప్రజల సమస్యలు పట్టించుకోని పెత్తందారు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కావాలా లేదా పిలిస్తే వచ్చి సమస్యలను పరిష్కరించే పేదవాడు సర్నాల తిరుపతిరావు కావాలా..ఆలోచించి మీ ఓటు ద్వారా ఎన్నుకోవాలని విజయవాడ వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) కోరారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. కాలనీలో కొద్దిసేపు ఎన్నికల ప్రచార వాహనంపై రోడ్ షోలో పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా యువత ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీలో కేశినేని, సర్నాల పాల్గొని యువకులను ఉత్సాహపరిచారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) మాట్లాడుతూ మీ అందరిలో ఒకడైన తిరుపతిరావు మీకు అందుబాటులో ఉంటారని, కాలనీలో తాగునీటి సమస్య వచ్చినప్పుడు పిలిస్తే వచ్చి సమస్యను పరిష్కరించటమే అందుకు నిదర్శనమని చెప్పారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి

తిరుపతిరావు మాట్లాడుతూ పేదలు, సామాన్యులు అభివృద్ధి చెందాలన్నా..యువత భవిష్యత్ బాగుపడాలన్నా వైఎస్ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడం చారిత్రాత్మక అవసరమని అన్నారు. ప్రజలను మభ్యపెట్టే చంద్రబాబు అండ్ కో కూటమి దుర్మార్గపు ఆలోచనలను తిప్పి కొట్టేలా రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి జగనన్న ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కె. సువర్ణరాజు, వైస్ ఎంపీపీ వేమూరి సురేష్, మైలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ మొగల్రాజపురం సున్నపుబట్టీల సెంటర్‌లో ఉన్న ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి నూతన కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్యులంతా వచ్చే ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని కోరారు. చింతామణి నాటకాన్ని ప్రదర్శించకుండా నిషేధించామని, రాష్ట్ర ప్రజలు అడగకుండానే వారి సంక్షేమానికి ఏమి కావాలో గుర్తించి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి రూ.50 కోట్లు కేటాయించారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డులో సభ్యులుగా కూడా ఆర్యవైశ్యులను వైఎస్.జగన్ నియమించారని చెప్పారు. నెల్లూరు జిల్లాకు పొట్టిశ్రీరాములు జిల్లాగా పేరుపెట్టారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్యవైశ్యులు అండగా ఉండాలని చెప్పారు. సంఘం అధ్యక్షుడిగా గడ్డం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కూసుమంచి వెంకట లక్ష్మి, కోశాధికారిగా సోము రమేష్, యువజన విభాగం అధ్యక్షుడిగా కనిగళ్ల అరుణ్ సంపత్, కార్యదర్శిగా చీమకుర్తి శంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా మారం రోజా రాణి, ప్రధాన కార్యదర్శి దేసు రాజ్యలక్ష్మి, సేవాదళ్ కమిటీ అధ్యక్షుడు బొగ్గరపు వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సింహాద్రి గోపి, ఆయా సంఘాల సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు పెనుగొండ సుబ్బారాయుడు తదితరులు హాజరయ్యారు.

చెక్‌పోస్టుల్లో విస్తృతంగా తనిఖీలు



నున్న(విజయవాడరూరల్): గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో వాహనాలను పోలీస్ అధికారులు విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. కార్లు, వ్యానులు, బైక్‌లను సైతం తనిఖీ చేస్తున్నారు. పవర్‌గ్రిడ్ వద్ద, కండ్రిక భవానీబార్ వద్ద, పైపులరోడ్డు వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. గత వారం చేసిన తనిఖీల్లో రూ.37లక్షలు నగదు పట్టుకున్నారు. అలానే ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న మద్యం బాటిళ్లను సైతం సీజ్ చేశామని సీఐ దుర్గాప్రసాద్ చెప్పారు. చెక్‌పోస్టుల్లో రేయింబవళ్లు వాహనాలు తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. నున్న పవర్ గ్రిడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఏలూరు జిల్లా, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలతో పాటు విజయవాడ ఆటోనగర్, గుణదల ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. పైపులరోడ్డు జంక్షన్ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ, నూజివీడు రాకపోకలు సాగించే వాహనాలు సోదా చేస్తున్నామన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఇతోధికంగా సాయం అందిస్తుందని ఆ సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. తిమ్మనవీడుకు చెందిన వీసం మహేష్ వీఐటీ అమరావతి క్యాంపస్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక స్థోమత లేకపోవటంతో ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతూ మానవత సంస్థను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో వీసం మహేష్‌కు రూ.17 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం పంపిణీ చేశారు. భవిష్యత్‌లోనూ తన వంతు సాయాన్ని అందిస్తామని మానవత సభ్యులు భరోసా ఇచ్చారు. మానవత హనుమాన్ జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కళ్లేపల్లి నారాయణరావు, సీనియర్ సభ్యులు బాణాల నరసింహరావు, నారగాని కొండలరావు, వడ్డి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజంతోనే అభివృద్ధి



ఉయ్యూరు: ఆరోగ్యవంతమైన సమాజంతోనే సమాజ ప్రగతి సాధ్యమని లయన్స్ క్లబ్ జిల్లా కేబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్, కార్యదర్శి నల్లా శ్రీనివాస్, ట్రెజరర్ ఊర కిషోర్‌కుమార్, ప్రతినిధులు నెల్లి రాంబాబు, అబ్దుల్ హసన్ పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్య సేవలు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పుట్టగుంట

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక కాకాని భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పుట్టగుంట సతీష్‌కుమార్ రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ జి.కృష్ణమోహన్ నేతృత్వంలో సుమారు 400 మందికి వైద్య సేవలు అందించారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, రమేష్ హాస్పిటల్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కోనేరు కోటేశ్వరరావు, అభయాంజనేయ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నందిగం వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, తాడి రంగారావు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురు మహాత్మాగాంధీ బొమ్మ సెంటర్‌లో రాష్ట్ర బీసీ సంఘం కార్యదర్శి కోసూరి నరేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం, చలువ పందిరిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోసూరి నరేష్ మాట్లాడుతూ యనమలకుదురు ప్రాంతంలో 8 వేల మంది ప్రాథమిక విద్య, అమ్మ ఒడి అందించి చదివిస్తున్న జగనన్న జనం గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించితే పేదలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ బాబురావు, కాలనీవాసులు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు సలీం, కరీంబాబు, లంక కోటేశ్వరరావు, అనిల్‌రెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత మానవాళికి అందిన గొప్పవరం



మాట్లాడుతున్న రజనీకాంత శర్మ

విజయవాడకల్చరల్: భగవద్గీత మానవాళికి అందిన గొప్పవరమని గీతా విజన్ ట్రస్ట్ చైర్మన్ గీతానంద్ పాక్కులూరి సుబ్బారావు అన్నారు. గీతా విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్షన్ హాల్‌లో గీత అవార్డుల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన సుబ్బారావు మాట్లాడుతూ.. సకల వేద సారం భగవద్గీతలో కనిపిస్తుందన్నారు. ప్రతీ ఏటా వివిధ రంగాల్లోని ప్రముఖుల సామాజిక సేవలను గుర్తించి వారికి గీతా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ చిన్నం రామకృష్ణ మాట్లాడుతూ.. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. సీనియర్ జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. భగవద్గీత గొప్ప వ్యక్తిత్వ వికాస గ్రంథంగా అభివర్ణించారు. వివిధ రంగాలకు చెందిన బొమ్మిరెడ్డి రాజశేఖరరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ వి.రజనీకాంత శర్మ పాల్గొన్నారు. దూరదర్శన్ వ్యాఖ్యాత అన్నపూర్ణ నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. వివిధ రంగాల్లోని వారికి నిర్వాహకులు గీతా అవార్డులను అందజేశారు.

సత్యసాయి సేవాసమితి సేవలు అభినందనీయం

నందిగామ టౌన్: స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని లింగాలపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సత్యసాయిబాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులను ఎమ్మెల్సీ అరుణకుమార్ అభినందించారు. వారి సేవలను కొనియాడారు. సర్పంచి బొల్లినేని పద్మజ, ఇన్‌చార్జి ఎంపీపీ ఆకుల హనుమంతరావు, నాయకులు బొల్లినేని శ్రీనివాసరావు, పారుపల్లి హరిబాబు, సత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామసమీపంలోగల అంతర్‌రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే రాష్ట్రంలోకి అనుమతించాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమంగా మద్యం, నగదు, బంగారం రవాణా కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రాజేశ్వరస్వామి ఆలయంలో బహిరంగ వేలం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని రాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు పాత ఇనుముకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పి. లోకేశ్వరి తెలిపారు. సీజీఎఫ్ పనుల్లో భాగంగా ఆలయం ముఖ మండపం కొట్టివేయగా వచ్చిన 500 కిలోల పాత ఇనుముకు దేవదాయశాఖాధికారుల సమక్షంలో ఈ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

దుకాణదారుల సమస్యల పరిష్కారం

పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద చిరు వ్యాపారాలు చేసుకునే దుకాణదారుల సమస్యలు తక్షణం పరిష్కరిస్తామని ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు తెలిపారు. ఆలయం వద్దనున్న దుకాణాలు గతేడాది ప్రమాదవశాత్తు కాలిపోవటంతో వారికి ఆలయ క్యాంటీన్ పక్కన దుకాణాలు నిర్మించారు. అయితే అక్కడ వ్యాపారాలు సాగకపోతుండటంతో వ్యాపారులు ఆ దుకాణాలను మూసేశారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఆదేశాల మేరకు చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వ్యాపారులను పిలిపించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని దుకాణాలు తెరుచుకోవాలని వ్యాపారులకు సూచించారు. దీంతో వ్యాపారులు తిరిగి దుకాణాలు నిర్వహిస్తున్నారు. పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గాలీబ్ షాహీద్ దర్గాలో చాదర్ సమర్పణ



గాలీబ్ షాహీద్ దర్గాలో చాదర్ సమర్పిస్తున్న ఎంపీ కేశినేని నాని, షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురంలోని సూఫీ మత గురువులు హజరత్ సయ్యద్ గాలీబ్ షాహీద్ రహమతులాల్లై 436వ ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. ఉరుసు మహోత్సవంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పాల్గొన్నారు. సూఫీ మత గురువులకు చాదర్ గంధం, పూలు సమర్పించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 175 సీట్లు గెలవాలని, పార్లమెంట్ సభ్యులుగా కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యేగా షేక్ ఆసిఫ్ గెలవాలని ప్రార్థనలు చేశారు. బాబా వారి గంధ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఫకీర్ల తప్పెట్లు, పాటలు ఉరుసులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, నాయకులు జీఎంసీ భాషా, స్థానిక కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, చైతన్యరెడ్డి, దర్గా ప్రెసిడెంట్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్, కమిటీ పెద్దలు సత్తార్, రెహమాన్, అస్గర్, బద్రుద్దీన్, ఇషాక్, ఖాజా, మైనారిటీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగదు, మద్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఏసీపీ భాస్కరరావు



ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు, గోడౌన్స్ యజమానులతో మాట్లాడుతున్న ఏసీపీ భాస్కరరావు

పటమట(విజయవాడతూర్పు): ఓటర్లకు పంపిణీ చేసేందుకు రాజకీయ పార్టీలు సమకూర్చిన డబ్బు, మద్యం, వస్తువులు రవాణా చేసిన వాహన యజమానులపై, నిల్వ చేసిన గోడౌన్ల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ భాస్కరరావు హెచ్చరించారు. పటమట పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల యజమానులు, గోడౌన్స్ యజమానులతో ఏసీపీ ఆదివారం సమావేశమయ్యారు. పటమట పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ ప్రజలను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు డబ్బు, మద్యం, ఇతర వస్తువులను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ వస్తువులను రవాణా చేసిన వాహనాలను సీజ్ చేస్తామని, నిల్వ ఉంచిన గోడౌన్లను సీజ్ చేస్తామని తెలిపారు. అయితే డబ్బు, మద్యం, వస్తువులు రవాణా జరుగుతున్నట్లు, గోడౌన్లలో నిల్వ ఉంచేందుకు చేస్తున్న ప్రయత్నాలు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐలు శాతకర్ణి, వల్లిపద్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం



వైద్యశిబిరాన్ని ప్రారంభించిన హీరోయిన్ శాంతిప్రియ, నిర్వాహకులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం గొర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సూర్యారావుపేటలోని విక్రాంత్ పబ్లిషర్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని సినీ హీరోయిన్ శాంతిప్రియ, రోటరీ మాజీ గవర్నర్ ఎం.సతీష్‌బాబుతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా శాంతిప్రియ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందించడం శుభపరిణామమన్నారు. 20 ఏళ్లుగా గొర్తి సత్యవతి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు రానున్న రోజుల్లో మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి, లత, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు హరిత తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో దియా మేకింగ్ పోటీలు



దీపాలను అందంగా అలంకరించిన చిన్నారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో క్రోధి నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం విద్యార్థులకు దియా మేకింగ్(దీపాల అలంకరణ) పోటీలను నిర్వహించారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తమలోని సృజనాత్మకతకు పదును పెట్టి విభిన్న రకాల దీపాలను అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి కే రమాదేవి విద్యార్థులకు ఉగాది విశిష్టతను వివరించారు. ఉగాది ప్రకృతికి సంబంధించిన పండుగ అని పేర్కొన్నారు. ప్రకృతిలో అనేక మార్పులు సంభవిస్తాయన్నారు. విద్యార్థులు తెలుగు పండుగల గురించి తెలుసుకోవాలని సూచించారు. చదువుతో పాటు ఆటపాటల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఠాగూర్ గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఏఎంసీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందజేస్తున్న నాగుల్‌మీరా, కమిటీ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద ముస్లింలకు సాయం చేయడమంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టమని, ఈ రంజాన్ పండుగ వేళల్లో పేద ప్రజలకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు సింగ్‌నగర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో ఆదివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో పేదలకు ఒక రూపాయి దానం చేస్తే అది 70 రూపాయలు దానం చేసినంత పుణ్యం వస్తుందన్నారు. ఏఎంసీ ఆధ్వర్యంలో పేదలకు ప్రతి నెలా ఏదో ఒక సేవా కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు. సేవాభావంతో ఈ నెల 100 కుటుంబాలకు రంజాన్ తోఫాను పంపిణీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ నాయకులు షేక్ సాజిద్‌అలీ, ఎండీ కాలేషా, సయ్యద్ మౌలాలి, సమీనాఫాతిమా, షరీఫ్, మస్తాన్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 వేల జరిమానా

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బహిరంగ వేలం ద్వారా లైసెన్స్ హక్కు పొందినవారు ఆయా వస్తువులను నిర్దేశించిన ధరల కంటే అధికంగా విక్రయిస్తే జరిమానా విధించడంతోపాటు లైసెన్స్‌ను రద్దు చేస్తామని ఆలయ ఈవో కె రమేష్‌నాయుడు హెచ్చరించారు. భక్తులు అధికంగా వచ్చే శుక్ర, ఆదివారాల్లో ఆయా వస్తువులను అధికంగా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కొబ్బరికాయను రూ.40కే విక్రయించాల్సి ఉండగా, భక్తులకు రూ.50లకు విక్రయించిన దుకాణదారుడికి రూ.5వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. నిర్ణీత ధరలకే విక్రయాలు జరపాలని ఆదేశించారు. నిబంధనలు పాటించని వారి దుకాణాల లైసెన్స్‌లను రద్దుచేస్తామని ఈవో హెచ్చరించారు.